డైవర్షన్ రోడ్డుతో తంటాలు

- బూడిద లేస్తుండడంతో ప్రయాణికులకు ఇక్కట్లు
- గుంతలతో నిత్యం ప్రమాదాలు
- పట్టింపులేని ఆర్అండ్‌బీ అధికారులు


తూరుబాకలో భద్రాచలం-చర్ల రహదారిపై కుంగిన కల్వర్టు


డైవర్షన్ రోడ్డుపై గుంతలో దిగబడిన ఇసుక లారీ (ఫైల్)


డెవర్షన్ రోడ్డుపై లారీలు వెళ్తుండడంతో లేచిన బూడిద

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామ శివారులో కుంగిన కల్వర్టు దగ్గర ఏర్పాటు చేసిన డైవర్షన్ రహదారి వల్ల ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు. సంబంధిత ఆర్అండ్‌బీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు విమర్శలొస్తున్నాయి. భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తూరుబాక గ్రామ శివారులో నిర్మించిన కల్వర్టు కుంగిపోవడంతో అధికారులు తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ డైవర్షన్ రోడ్డులో పోసిన మెటల్ నుంచి వచ్చే దుమ్ము, బూడిదతో వెనుక వచ్చే వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. డైవర్షన్ రోడ్డు ఇచ్చిన అధికారులు దెబ్బతిన్న కల్వర్టుపై నుండి కూడా రాకపోకలకు అవకాశం ఇవ్వడంతో అటుఇటు వాహనాలు వెళ్తూ ఒకే దగ్గరకు వచ్చే సరికి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఏర్పడ్డాయి. డైవర్షన్ రోడ్డులో నుండి భారీ ఎత్తున ఇసుక లారీలో వెళ్తుంటే లేచే బూడిదను అరికట్టడానికి కనీసం వాటరింగ్ కూడా చేపట్టకపోవడం అధికారులు పనితీరుకు నిదర్శనం.

వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు..

భద్రాచలం-చర్ల ప్రధాన రహదారి గుండా నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం చర్ల, వెంకటాపురం మండలాల నుంచి ఇసుక లారీలు సైతం ఇటువైపే వస్తుండటంతో పాటు మితిమీరిన వేగంతో ఓవర్ టేక్ చేస్తూ వెళ్తుండటంతో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. అంతేకాక ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఈ రహదారి గుండా తరలివస్తుంటారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన భారీ లారీలు సైతం ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అధికారులు పనులు చేపట్టకపోవడం విస్మయం కలుగజేస్తోంది.

అనుమతులు ఎలా ఇచ్చారు?

తూరుబాక గ్రామ శివారులోని కల్వర్టు కుంగి పోవడంతో తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు ఏర్పాటు చేశారు. కాగ ఆ రహదారిపై భారీ బరువు గల ఇసుక లారీలు వెళ్తుండటంతో ఎక్కడిక్కడ కుంగిపోతోంది. డైవర్షన్ రోడ్డుపై ఇసుక లారీలు వెల్లడానికి అనుమతులు ఎవరిచ్చారన్నది ఇక్కడ ప్రశ్న. రోడ్డు మరమ్మతులో ఉండటం వల్ల ఇసుక లారీలు వెళ్లకుండా పోలీసు శాఖ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

గోతులమయంగా రహదారి..

తూరుబాక బ్రిడ్జి నుంచి సీతారాంపురం వరకు భద్రాచలం-చర్ల ప్రధాన రహదారిపై తారు లేచిపోయి గోతులు పడి ప్రమాదకరంగా మారింది. అధికారులు గతంలో తూతూ మంత్రంగా మరమ్మతు పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో ఎక్కడెక్కడ మరమ్మతు పనులు చేపట్టారో మళ్లీ అదే స్థలంలో రోడ్డు మరమ్మతులకు గురైంది. గోతుల రహదారితో ప్రమాదాల మూలంగా కొంత మంది ప్రాణాలు కోల్పోతుండగా మరికొంత మంది క్షతగాత్రులుగా మాదుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు తూరుబాక దగ్గర కల్వర్టు నిర్మాణంతో పాటు గోతులమయంగా మారిన రహదారి నిర్మాణ పనులు వెంటే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..

గోతులమయంగా మారిన రహదారిని త్వరలోనే మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేస్తాం. అలాగే కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాడిపూ టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం. డైవర్షన్ రోడ్డులో భారీ వాహనాలు వెల్లకుండా స్థానికంగా ఉండే అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– లాల్‌సింగ్, ఈఈ, ఆర్అండ్‌బీ

క్లుప్తంగా

క్రీడా స్థలం కేటాయింపుపై హర్షం

దమ్మపేట: మండలంలోని అంకంపాలెం, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలకు, క్రీడా స్థలం కేటాయించడంపై ఆశ్రమ పాఠశాల హెచ్ఎం శారద, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ.. స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాలకు పక్కనే ఉన్న ఖాళీ స్థలం యజమానితో మాట్లాడి, ఆ స్థలాన్ని పాఠశాలకు కేటాయించినట్లు తెలిపారు. క్రీడా స్థలం చదును చేసే పనులను స్థానికులు, పాఠశాల సిబ్బంది మంగళవారం ప్రారంభించారు. పనుల్లో పీడీ వెంకన్న, స్థానిక యువత వాడే వెంకట్రావు, పెనుబల్లి రమేష్, కాకా ప్రసాద్, కాకా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఈకి వినతి

మణుగూరురూరల్: విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న ఇంజనీర్లకు బదిలీ అవకాశం కల్పించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీఎస్‌పీఈఏ) బీటీపీఎస్ బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో బీటీపీఎస్ సీఈ బి.బిచ్చన్నకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి బి.రవిప్రసాద్‌లు మాట్లాడుతూ.. ఏఈలను, కొత్తగా నియమితులైన ఏడీఈలను బదిలీల్లో భాగంగా వారు కోరుకున్న ప్రాంతాలకు పంపి భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈఏ బ్రాంచ్ అడిషనల్ కార్యదర్శి శ్రీకాంత్, వెంకటకృష్ణ, రాము, రమణ, రషీద్ అహ్మద్, మహిళా ప్రతినిధి అల్తాఫా ఉన్నీసా పాల్గొన్నారు.

సర్వేకు సహకరించాలి

బూర్గంపాడు: ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక, సామాజిక, కుల గణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీఓ జమలారెడ్డి కోరారు. సారపాకలో జరుగుతున్న సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వేను వేగవంతం చేయాలని, నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. సర్వేలో సేకరించిన వివరాలను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు ఇవ్వాలి

భద్రాచలంటౌన్: ఆర్టీసీలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసేందుకు ప్రభుత్వం కార్మిక సంఘాల ఏర్పాటుకు అనుమతివ్వాలని సీఐటీయూ నాయకుడు ఎంవీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ డిపో గేట్ ముందు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీలో కార్మిక సంఘాలకు గుర్తింపు సంఘ ఎన్నికలు జరపాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఎంబీ నర్సారెడ్డి, నాగరాజు, అజయ్, మత్తయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన


వనసమారాధనలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా..

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని వెంకమ్మ చెరువు కట్టపై ఉన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా కార్తీక వనసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, మెచ్చా నాగేశ్వరరావులు హాజరయ్యారు. కార్యక్రమంలో భక్తులు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొని వనభోజనాలు ఆరగించారు.

ఉత్తమ పంచాయతీ కార్మికుడిగా జలంధర్


జలంధర్‌ను సన్మానిస్తున్న అధికారులు

అశ్వాపురం: ప్రపంచ టాయిలెట్‌డే సందర్భంగా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ మల్టిపర్పస్ వర్కర్‌గా ఎంపికైన మండలంలోని గొందిగూడెం గ్రామ పంచాయతీ కార్మికుడు బండ్ల జలంధర్‌ను మంగళవారం జ్ఞాపిక అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ విద్యాచందన, అశ్వాపురం ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ ముత్యాలరావు, గొందిగూడెం పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

విద్యార్థులను సిద్ధం చేయాలి

భద్రాచలంటౌన్: మండలంలోని ప్రతి పాఠశాల విద్యార్థులను డిసెంబర్ 4న జరిగే ఎన్ఏఎస్ పరీక్షకు సిద్ధం చేయాలని ఎంఈఓ టి.రమ అన్నారు. జగదీష్ కాలనీలోని ప్రాథమికోన్నత పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను, వర్క్‌బుక్స్‌లతో పాటు ఉపాధ్యాయుల తరగతి బోధనను పరిశీలించారు. పాఠశాల రికార్డులతో పాటు విద్యార్థులు ప్రగతికి సంబంధించిన ప్రొగ్రెస్ చూసి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం రాజా శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ పనులపై సామాజిక తనిఖీ

దుమ్ముగూడెం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో మార్చి 1, 2023 నుంచి మార్చి 31, 2024 సంవత్సరానికి గాను రూ.8.22 కోట్ల నిధులతో చేపట్టిన 800 పనులపై చర్చించారు. మంగళవారం డీఆర్‌డీఓ అడిషనల్ పీడీ రవి, జిల్లా విజిలెన్స్ అధికారి రమణారావు, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ ముత్యాలరావు, ఏపీఓ సుకన్యల సమక్షంలో 15 పంచాయతీల్లో చేపట్టిన పనులను ప్రజావేదికలో వివరించారు. అంతకు ముందు చేపట్టిన సామాజిక తనిఖీల్లో ఏ ఏ గ్రామాల్లో ఎంత మేరకు తప్పిదాలు చోటు చేసుకున్నాయనే విషయాన్ని సామాజిక తనిఖీ బృందాలు అధికారులకు వివరించారు. నేడు మిగతా పంచాయతీలకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక జరుగనుంది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

పార్టీని బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు శ్రీనివాసరావు

దమ్మపేట: భారతీయ జనతా పార్టీని, బూత్ స్థాయిలో బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా నాయకుడు జల్లూరపు శ్రీనివాసరావు మండల నాయకులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రం, దమ్మపేట బీజేపీ పార్టీ కార్యాలయంలో బూత్ కమిటీలపై సమీక్ష, వర్క్ షాప్ నిర్వహించారు. సమావేశంలో జల్లూరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ క్రియాశీల సభ్యత్వాల నమోదు, బూత్ కమిటీల విధివిధానాలపై వివరించారు. గ్రామ స్థాయిలో బూత్ కమిటీలను ఏర్పాటు చేసి, ఆ కమిటీల ద్వారా పార్టీ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలికపోగు ముసలయ్య, గొట్టిపుళ్ల దుర్గాశ్రీనివాస్, ప్రశాంత్, సతీష్, నాగరాజు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి

మణుగూరుటౌన్: మణుగూరు ఓసీపీలో పనిచేస్తున్న షెల్ పికింగ్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఓసీపీ మేనేజర్ రాజేశ్వరరావుకు ఏఐటీయూసీ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట రామనర్సయ్య మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ఆర్థిక భారంతో కుటుంబ పోషణ గడవక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి ఆర్థిక ఇబ్బందులను కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకుని వెంటనే సదరు కాంట్రాక్టర్ చేత వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆదర్ల సురేందర్, సాయిప్రకాశ్, సుధాకర్, చొప్ప సుధాకర్, షెల్ పికింగ్ కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రియాశీలకంగా పని చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మణుగూరురూరల్: బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి మహిళా కార్యకర్తలు క్రియాశీలకంగా పని చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. పట్టణంలోని తెలంగాణ భవన్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మహిళా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల జరగనున్నందున బీఆర్ఎస్‌ను గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న వ్యతిరేక విధానాల్లో ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని, ఆరు గ్యారెంటీల అమలుపై అధిష్టానం పిలుపునిచ్చే ఉద్యమాలకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంటా లక్ష్మణ్, కోకన్వీనర్లు బొలిశెట్టి నవీన్, నూకారపు రమేష్, మహిళా నాయకురాలు రమాదేవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాల్లో గడ్డిని కాల్చొద్దు


రైతు నేస్తం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ చంద్రశేఖరరెడ్డి

దమ్మపేట: వరి కోతలను యంత్రాల సహాయంతో కోసిన అనంతరం పొలాల్లో గడ్డిని కాల్చి, వాతావరణ కాలుష్యానికి కారణమవ్వొద్దని రైతు నేస్తం కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు సూచించారు. మంగళవారం మండలంలోని గండుగులపల్లి రైతు వేదికలో, మండల వ్యవసాయ అధికారి శీలం చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో రైతు నేస్తం కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల చేసిన సూచనలను ఏఓ రైతులకు సమగ్రంగా వివరించారు. గడ్డిని కాల్చకుండా నేలలో కలియ దున్నడం ద్వారా భూసారం పెరుగుదలతో పాటుగా నత్రజని లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. లేదంటే గడ్డిని బేలర్ల వంటి ఆధునిక యంత్రాల ద్వారా చుట్టలుగా చుట్టి, పశువుల మేతకు వినియోగించుకోవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఈఓలు మేకల దీప్తి, అనుబాబు, వినోద్, కేశవరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మణుగూరురూరల్: మండలంలోని వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అఖిల భారత విద్యార్థి సమైక్య(ఏఐఎస్ఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని నాలుగు బాలికల వసతిగృహాలను వారు సందర్శించి పరిశీలించారు. వసతిగృహ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పవన్‌సాయి మాట్లాడుతూ.. బాలికల వసతి గృహాల్లో వార్డెన్లు సరిగా ఉండకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వసతిగృహంలోని విద్యార్థినులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని, సరైన మెనూ పాటించడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపి విధులు సక్రమంగా నిర్వహించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

గిరిజనుల శ్రమదానం


రోడ్డు మరమ్మతు పనుల్లో పాలుపంచుకుంటున్న మనుబోతులగూడెం గ్రామస్తులు

అశ్వాపురం: మండల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామమైన మనుబోతులగూడెం గ్రామానికి ఎన్నో ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక గిరిజనులు అష్టకష్టాలు పడుతున్నారు. నిధులు మంజూరైనా అటవీ శాఖ వారు రహదారి నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదు. దీంతో ప్రస్తుతం ఉన్న మట్టి రోడ్డు వర్షాకాలంలో వాగు ప్రవాహానికి రహదారి కోతకు గురై గుంతలు గుంతలుగా ఉండి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం గ్రామస్తులందరూ స్వచ్ఛందంగా ఇంటికి ఒకరు వచ్చి వేములూరు నుంచి మనుబోతులగూడెం వరకు రహదారి శ్రమదానం చేశారు. రహదారిపై గుంతలు పూడ్చి రహదారి వెంబడి చెత్తాచెదారం తొలగించారు. సగం వరకు పూర్తయిందని నేడు రహదారి మొత్తం పూర్తవుతుందని గ్రామస్తుడు ఏనిక శివాజీ తెలిపారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

అశ్వారావుపేట: అశ్వారావుపేటలోని ప్రొఫెసర్ జయశంకర్ సార్ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా సంకురాత్రి సతీష్, కేశుబోయిన వీరాంజనేయులు మంగళవారం ఎన్నికయ్యారు. స్థానిక కెమిలాయిడ్స్‌లో జరిగిన ఎన్నికల్లో వీరితోపాటు గౌరవ అధ్యక్షుడిగా వాసు, ఉపాధ్యక్షులుగా గోపాల్, కొర్రి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా జంగం ఆంజనేయ ప్రసాద్, ప్రచార కార్యదర్శిగా ఇస్లావత్ వినోద్ కుమార్, సహాయ కార్యదర్శిగా దొంగా పరమేశ్ ఎన్నికయ్యారు.

మరుగుదొడ్ల దినోత్సవ ర్యాలీ

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని భీమునిగూడెంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మహాలక్ష్మి మాట్లాడుతూ.. మరుగుదొడ్ల అవశ్యకతను వివరించారు. విధిగా ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డి నిర్మించుకుని వాడాలని సూచించారు.

శివాలయంలో బిల్వార్చన

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం లక్ష బిల్వార్చన కార్యక్రమం నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏకాదశీ రుద్రాభిషేకం చేశారు. స్వామి వారి కార్యాన్ని రాజాపురం గ్రామానికి చెందిన ఉపేందర్‌రెడ్డి దంపతులు దగ్గరుండి జరిపించారు.

సీపీఐ వందేళ్ల ఉత్సవాలు

మణుగూరురూరల్: సీపీఐ శత ఆవిర్భావ ఉత్సవాలను ఘనంగా జరుపుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొల్లోజు అయోధ్య నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండలంలోని విప్పలసింగారం గ్రామంలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు కావస్తున్నందున గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగురవేసి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి జంగం మోహన్‌రావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి గద్దం వెంకటేశ్వర్లు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

25లోపు సర్వే పూర్తి చేయాలి

చంద్రుగొండ: ఈ నెల 25వ తేదీ వరకు ఇంటింటి సమగ్ర సర్వే పూర్తి చేయాలని జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సంజీవరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆయన తహసీల్దార్ సంధ్యరాణి, ఎంపీడీఓ అశోక్, డీటీ ప్రసన్నలతో సమావేశమయ్యారు. ఇప్పటి వరకు మండలంలో 61శాతం సర్వే పూర్తి అయిందన్నారు. మొత్తం 9,818 ఇళ్లు ఉండగా అందులో 6,054 ఇళ్ల సర్వే పూర్తి అయినట్లు పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ కృష్ణప్రసాద్

అశ్వారావుపేట: మండల పరిధిలోని ఊట్లపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ కృష్ణప్రసాద్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, స్థానిక రైతులు, కాంగ్రెస్ నాయకులు సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి రమేష్‌బాబు, మొగళ్లపు చెన్నకేశవరావు, తుమ్మ రాంబాబు, జేష్ఠ సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

రేపు సీపీఎం మండల మహాసభ

ములకలపల్లి: సీపీఎం 9వ మండల మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. మండల పరిధిలోని మాధారం గ్రామంలో రేపు (గురువారం) నిర్వహించే సభకు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులతోపాటు, మండల ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. గతంలో మండలంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన పోరాటాలు, ఉద్యమాలపై సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

రగ్గుల పంపిణీ

అశ్వారావుపేట: మండల పరిధిలోని చెన్నాపురం మారుమూల గిరిజన గ్రామస్తులకు సత్తుపల్లికి చెందిన వైద్యురాలు సుధా కొనకళ్ల తన చారిటబుల్ ట్రస్టు ద్వారా రగ్గులు పంపిణీ చేశారు. మంగళవారం చెన్నాపురం గ్రామాన్ని సందర్శించిన గిరిజనులు చలికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు రగ్గులు, పిల్లలకు బిస్కెట్‌లు పంపిణీ చేశారు.

విద్యార్థులకు అభినందన

దమ్మపేట: జోనల్ క్రీడల్లో సత్తా చాటిన దమ్మపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులకు గురుకుల ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ గురుకులాల 10వ జోనల్ క్రీడలు ఈ నెల 11 నుంచి 14 వరకు మరిపెడ గురుకులంలో జరిగాయని తెలిపారు.

పోటీలు మొత్తం 50 విభాగాల్లో జరుగగా దమ్మపేట గురుకుల విద్యార్థులు మొత్తం 31 మంది పతకాలు సాధించినట్లు తెలిపారు. జోనల్‌లో గెలుపొందిన విద్యార్థులు డిసెంబరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. విద్యార్థులకు తోడ్పాటు అందించిన పీడీ గోపాల్, పీఈటీ సమ్మయ్యలను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులను అధ్యాపక బృందం కూడా అభినందించి, రాష్ట్ర స్థాయిలో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు.


పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి

దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 107వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పలు చోట్ల ఆస్పత్రుల్లో రోగులకు పాలు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానిగా ఉన్నప్పుడు దేశం కోసం ఇందిరా చేసిన సేవలను కొనియాడారు. పలువురు పార్టీ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


చంద్రుగొండ: ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


మణుగూరుటౌన్: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం


భద్రాచలంటౌన్: ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పొదెం వీరయ్య, నాయకులు